సాక్షి తిరుపతి

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



ఆర్బీకేల్లో ఎరువులు

తిరుపతి అర్బన్: జిల్లాలోని ఆర్బీకేల్లో రబీసీజన్‌కు కావాల్సిన ఎరువులు ఉన్నాయని డీఏఓ ప్రసాద్‌రావు తెలిపారు.



చైర్ ఓరేషన్ విజయవంతం

తిరుపతి తుడా: స్విమ్స్ న్యూరోసర్జరీ విభాగం ఆధ్వర్యంలో చైర్ ఓరేషన్ విజయవంతమైందని డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు.

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	35	22
చిత్తూరు	34	22
తిరుమల	30	18
గూడూరు	36	24
నగరి	34	23

గ్రామీణ ప్రాంతాలకు బీఎస్ఎన్ఎల్ సేవలు

తిరుపతి అర్బన్: గ్రామీణ ప్రాంతాలకు సైతం బీఎస్ఎన్ఎల్ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషిచేస్తున్నట్లు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. తిరుపతిలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో శనివారం టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ ప్రైవేటు సంస్థలకు దీటుగా పనిచేయడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. మరోవైపు పల్లె ప్రాంతాలకే కాకుండా పట్టణాలు, నగరాల్లోనూ కొన్నిచోట్ల బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి సిగ్నల్స్ అందడం లేదని వస్తున్న ఫిర్యాదుల మేరకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్మిస్తున్న 113 టవర్స్‌ను వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. జనరల్ మేనేజర్ అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ మెరుగైన సేవలను అందించడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. సమావేశంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఏకోబారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీని బీఎస్ఎన్ఎల్ సిబ్బంది సత్కరించారు.

అలిపిరిలో

దివ్యానుగ్రహ విశేష హోమం



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుమల: తిరుపతి అలిపిరిలోని సప్తగోప్రదక్షిణ మండపంలో కార్తీక మాసం(నవంబర్)లో శ్రీ వేంకటేశ్వర దివ్యానుగ్రహ విశేష హోమాన్ని ప్రారంభించనున్నట్లు టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో సప్తగోప్రదక్షిణ మండపంలో నిత్యం శ్రీ వేంకటేశ్వర దివ్యానుగ్రహ విశేష హోమం నిర్వహించాలని టీటీడీ నిర్ణయించినట్టు వెల్లడించారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ ఈ విశేష హోమంలో భాగంగా ప్రతి రోజూ భక్త సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సద్యోన్ముకార్పణం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్టాపనం, కుంభార్చనలు వంటివి నిర్వహించనున్నట్లు తెలిపారు. గృహస్తులు ధోవతి, ఉత్తరీయం, చీర ధరించి హోమంలో పాల్గొనాలన్నారు. సమావేశంలో శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులలో ఒకరైన వేణుగోపాల దీక్షితులు, జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖకుమార్, సీఈ నాగేశ్వరరావు, ఎస్వీ గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



నేడు తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్న గవర్నర్


ఏపీ గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుమల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. శనివారం రాత్రి ఆయన తిరుమలకు చేరుకోగా.. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి రచన అతిథి గృహం వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్‌కు దర్శనం ఏర్పాట్లు చేశారు.

ఇస్రో విజయోత్సాహం


క్రూమాడ్యూల్‌ను సేవ్ చేసిన తర్వాత సంబరాలు చేసుకుంటున్న కోస్టల్ నేవీ అధికారులు, సిబ్బంది

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో సంబరాలు అంబరాన్నంటాయి. శనివారం ఇక్కడి నుంచి ప్రయోగించిన గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ టీవీ–డీ1 ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలు సంబరాల్లో మునిగితేలారు. ఈ ప్రయోగంలో క్రూ మాడ్యూల్ ఎస్కేప్ సిస్టంను అంతరిక్షంలోకి పంపించి దాన్ని సురక్షితంగా కోస్టల్ నేవీ గార్డ్స్ సేవ్ చేశారు. భూమి నుంచి 17 కిలోమీటర్ల ఎత్తులో అంతరిక్షంలోకి వెళ్లి పది పారాచూట్ల సహాయంతో సముద్రంలో పడిన క్రూ మాడ్యూల్‌ను కోస్టల్ నేవీ గార్డ్స్ సురక్షితంగా కాపాడారు. మానవులను అంతరిక్షంలోకి పంపించే ప్రయోగాలకు ఇది తొలిమెట్టుగా ఇస్రో పేర్కొంది.









ఆరోగ్య సంక్షేమ ప్రదాత జగనన్న

– తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



పేరూరులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, లబ్ధిదారులకు కంటి అద్దాలను అందించిన మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలతో పాటు ప్రతి ఒక్కరికీ మెరుగైన ఆరోగ్యం కోసం తపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ఆరోగ్య సంక్షేమ ప్రదాతగా నిలుస్తున్నారని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. తిరుపతి రూరల్ మండలం, పేరూరు హరిపురం కాలనీలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేశారు. కంటి సంబంధ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు కంటి అద్దాలను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గం ప్రజల సంక్షేమం కోసం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అందులో భాగంగా ప్రతి ఇంటికీ ఉచితంగా మెగా రక్త పరీక్షల కార్యక్రమం చేపట్టి 42 రకాల వ్యాధులకు పరీక్షలను నిర్వహించినట్లు గుర్తు చేశారు. నియోజకవర్గంలో చేపట్టిన ఆరోగ్య పరీక్షల స్ఫూర్తితోనే రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమం పురుడుపోసుకుందని, ఎమ్మెల్యే చెవిరెడ్డి అంకితభావానికి ఇది నిదర్శనమన్నారు. అనంతరం సురక్ష కార్యక్రమంలో బీపీ పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దామినేటి కేశవులు, పంచాయతీ కార్యదర్శి మాధవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

17 ఎర్రచందనం దుంగల స్వాధీనం


పట్టుపడిన ఎర్రచందనం దుంగలతో అటవీశాఖ సిబ్బంది

రాపూరు: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, తెగచర్ల గ్రామ సమీపంలోని అడవిలో శుక్రవారం అర్ధరాత్రి అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన 17 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రాపూరు అటవీశాఖ రేంజర్ రవీంద్రబాబు తెలిపారు. ఆయన కథనం.. జిల్లా అటవీశాఖ అధికారికి ముందుగా అందించ సమాచారం మేరకు జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు, నెల్లూరు రేంజ్‌లో అటవీశాఖ అధికారులను అప్రమత్తం చేశాం. పోరుమామిళ్ల నుంచి ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేస్తున్నట్టు సమాచారం అందడంతో అన్ని చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేశాం. అందులో భాగంగా శుక్రవారం రాత్రి రాపూరు మండలం, తెగచర్ల గ్రామ సమీపంలో అడవిలోకి కారు వెళ్లినట్లు గుర్తించాం. ఆ ప్రాంతంలో అటవీశాఖ సిబ్బంది నిఘా ఉంచారు. సోమశిల జలాశయం బాక్ వాటర్ వద్ద నుంచి తీసుకువచ్చిన ఎర్రచందనం దుంగలను కారులో ఎక్కించేందుకు సిద్ధం చేస్తుండగా అటవీశాఖ సిబ్బంది ఒక్కసారిగా వారిని చుట్టుముట్టడంతో స్మగ్లర్లు రాళ్లతో దాడీ చేస్తూ అడవిలోకి పారరయ్యారు. అందులో తమిళనాడుకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు రేంజర్ తెలిపారు. 17 ఎర్రచందనం దుంగలు, కారు, రెండు మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన ఎర్రచందనం విలువ దాదాపు రూ.5 లక్షలు ఉంటుందని తెలిపారు. దాడుల్లో అటవీశాఖ సిబ్బంది వరప్రసాద్, బాలాజీ, ప్రవీణ్, నాగులు, బాగ్యరాజు, వెంకటేశ్వర్లు, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లికి ప్రేమి'కులం' అడ్డు!

- కులాంతర వివాహానికి ఒప్పుకోని ప్రియుడు
- మనస్తాపానికి గురైన ప్రియురాలు
- ఫోన్‌లో ప్రియుడితో మాట్లాడుతూ ఆత్మహత్య
- వెంకటగిరిలో ఘటన



ఆత్మహత్య చేసుకున్న కావ్య, కావ్య (ఫైల్)

వెంకటగిరి రూరల్: ప్రేమిస్తున్నానంటూ నమ్మబలికాడు. పెళ్లి చేసుకుంటానని దగ్గరయ్యాడు. ఆపై పెళ్లిమాట ఎత్తగా ఎప్పటికప్పుడు దాటవేస్తూ తప్పించుకోవడం ప్రారంభించాడు. గట్టిగా నిలదీయగా.. 'మీది వేరే కులం.. నిన్ను చేసుకోవడం మా ఇంట్లో వాళ్లకు ఇష్టం లేదు' అంటూ ముఖంపై తెగేసి చెప్పేశాడు. పాపం.. అతనే జీవితమని నమ్ముకున్న ఆ ప్రియురాలి మనసు కకావికలమైంది. తీవ్ర మనస్తాపానికి గురైంది. మిద్దెపై నుంచి ప్రియుడితో ఫోన్‌లో మాట్లాడుతూ ఉరివేసుకుని తనువు చాలించింది. ఈ ఘటన వెంకటగిరి పట్టణంలోని 5వ వార్డు కాలేజీ మిట్టలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు మృతురాలి తల్లి భారతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. భారతికి కుమారుడు, కుమార్తె కావ్య ఉన్నారు. కావ్య (25) బీటెక్ పూర్తిచేసి పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో పనిచేస్తోంది. రెండేళ్ల క్రితం ఆమె ఓ ప్రైవేటు కంపెనీలో ఉపాధి నిమిత్తం విధులు నిర్వర్తిస్తుండగా పెళ్లకూరు మండల కేంద్రానికి చెందిన తేజతో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారడంతో తేజ పెళ్లి చేసుకుంటానని కావ్యను నమ్మించాడు. దీంతో కావ్య తేజకు దగ్గరైంది. అలా రెండేళ్ల వరకు గడిచాయి. కావ్య తేజాతో పెళ్లి విషయంపై మాట్లాడినప్పుడల్లా అతను ఏదో ఒకరకంగా మాట్లాడుతూ దాటవేసేవాడు. కావ్య అతన్ని గట్టిగా ప్రశ్నించడంతో 'మీది వేలే కులం.. మాది వేరే కులం.. నిన్ను పెళ్లిచేసుకోవడం మా ఇంట్లో వాళ్లకు ఇష్టం లేదు. నిన్ను నేను పెళ్లి చేసుకోలేను' అంటూ యువతికి సమాధానం ఇచ్చాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కావ్య శుక్రవారం రాత్రి ప్రియుడు తేజాకు చివరిసారిగా ఫోన్‌చేసి పెళ్లి చేసుకోమని ప్రాధేయపడింది. అతను ఒప్పుకోకపోవడంతో విధిలేని పక్షంలో ఆ యువతి ప్రియుడితో ఫోన్‌లో మాట్లాడుతూ తన ఇంటి మిద్దెపైన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కావ్య ఎంతకీ కనిపించకపోవడంతో అనుమానంతో కుటుంబ సభ్యులు మిద్దెపైకి వెళ్లి పరిశీలించగా.. ఆమె విగత జీవిగా ఉరితాడుకు వేలాడుతోంది. కావ్య ఫోన్ కాల్‌డేటా ఆధారంగా మృతురాలి తల్లి భారతి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కావ్య మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

దసరా ధమాకా

- పండుగ ఆఫర్స్‌తో కిటకిటలాడుతున్న షాపింగ్ మాల్స్
- గతంకంటే మూడింతలు పెరిగిన గృహోపకరణాలు
- పోటీ పడి బంపర్ ఆఫర్లతోఆకట్టుకుంటున్న వస్త్ర దుకాణాలు
- వన్ ఫ్లస్ వన్, 60 శాతం ఆఫర్లను ప్రటించిన జనరల్ స్టోర్స్
- క్యాష్‌బ్యాక్, డిస్కౌంట్ల ప్రకటనలతో మార్మోగిస్తున్న మొబైల్స్‌షాపులు
- బైక్, కార్ల షోరూమ్‌ల్లోనూ పెరిగిన అమ్మకాలు



కస్టమర్లతో కిటకిటలాడుతున్న ఓ వస్త్ర దుకాణం, గృహోపకరణాలు కొనుగోలు చేస్తూ..



మొబైల్ కొనుగోలు చేస్తున్న కస్టమర్లు, డిజిటల్ షోరూమ్‌లో ఏసీ కొనుగోలు చేస్తున్న ప్రజలు

తిరుపతి సిటీ: దసరా ధమాకా సేల్స్‌తో తిరుపతి నగరంలోని షాపింగ్ కాంప్లెక్స్, మాల్స్, డిజిటల్ షోరూమ్‌లలో సందడి నెలకొంది. అమ్మకాలను పెంచుకునే ప్రయత్నంలో పోటీ పడి దసరా బంపర్ ఆఫర్లను ప్రకటిస్తూ షాపింగ్ కాంప్లెక్స్ యాజమాన్యాలు కష్టమర్లను ఆకట్టుకుంటున్నాయి. గృహోపకరణ వస్తువులకు గత ఏడాదికంటే ఈ సారి డిమాండ్ బాగా పెరిగింది. ఈనెల మొదటి వారం నుంచే పలు వస్త్ర దుకాణాలు పెద్ద ఎత్తున్న దసరా, దీపావళి ఆఫర్లను ప్రకటించాయి. దీనికితోడు పాఠశాలలకు 11రోజుల పాటు సెలవులు రావడంతో ఇంటిల్లిపాది ఆఫర్లు, డిస్కౌంట్లు ప్రకటించిన షాపింగ్ మాల్స్‌వైపు దృష్టి పెట్టారు. ఇదేక్రమంలో దసరా పండుగ నేపథ్యంలో విజయదశమికి గృహోపకరణ వస్తువులను కొనుగోలు చేసేందుకు ఆసక్తిచూపుతున్నారు. నగరంలోని గాంధీరోడ్డు, తీర్థకట్టవీధి, చిన్నబజారు వీధి, వీవీ మహల్ రోడ్డు, తిలక్‌రోడ్డు, లీలామహల్ సర్కిల్, రేణిగుంటరోడ్డు, ఎయిర్ బైపాస్ రోడ్డులోని షాపింగ్ మాల్స్, డిజిటల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో దసరా సందడి కనిపిస్తోంది.

భారీ డిస్కౌంట్లు

ప్రధానంగా ఈ ఏడాది గృహోపకరణాలపై ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నగరంలోని లీలా మహల్ సర్కిల్ ప్రాంతంలో కొత్తగా నెలకొల్పిన ఓ షాపింగ్ మాల్‌లో కాంబో ఆఫర్ల పేరుతో రూ.74,450కే టీవీ, ఏసీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, స్టౌ, ఫ్యాన్, మిక్సీ, రైస్‌కుక్కర్, గ్రైండర్ వంటి గృహోపకరణాలకు అందిస్తోంది. తిలక్ రోడ్డులోని డిజిటల్ షోరూమ్‌లలో రూ.10 వేలకు పైగా కిచెన్ అప్లియెన్సెస్ కొనుగోలు చేస్తే ఆకర్షణీయమైన బహుమతులతో పాటు ఫైనాన్స్ సౌకర్యం, క్యాష్‌బాక్, పాత వస్తువుల ఎక్ఛేంజ్ ఆఫర్లు ప్రకటించింది. అన్ని టీవీ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కంపెనీలు ఎల్ఈడీ టీవీల ధరలు భారీ ఎత్తున తగ్గించేశాయి. గత ఏడాది కంటే మూడురెట్లు అమ్మకాలు పెరిగాయని షాపుల యజమానులు చెబుతున్నారు.

2లక్షల రకాల డిజైన్లతో ఫెస్టివల్ ఆఫర్స్

నగరంలోని వస్త్ర దుకాణాలు కస్టమర్లతో కిటకిటలాడుతున్నాయి. ఎయిర్ బైపాస్‌లోని పేరొందిన ఓ వస్త్ర దుకాణం ఏకంగా 2 లక్షల రకాల డిజైన్లతో ఫెస్టివల్ ఆఫర్లను ప్రకటించింది. ఫ్యాన్సీ శారీస్, కుర్తాస్, వెస్ట్రన్‌వేర్, కిడ్స్ సూట్స్, షర్ట్స్, టీ షర్ట్స్, సూట్స్, బ్లేజర్స్, మహిళలను, యువతులను ఆకట్టుకునే పంజాబీ, పట్టువస్త్రాలు, ధర్మవరం, కంచి, వెంకటగిరి శారీస్‌లకు భారీ డిస్కౌంట్ కల్పిస్తూ ఆఫర్లను ప్రకటించింది. నగరంలోని సుమారు 20 ప్రధాన వస్త్ర దుకాణాలలో వన్ ప్లస్ వన్ ఆఫర్లు, 30 నుంచి 60శాతం వరకు డిస్కౌంట్లు, కూపన్లతో ఉచిత బహుమతులు ప్రకటించాయి.

హోటల్స్‌కు తాకిన ఆఫర్ల ఫీవర్

ఫెస్టివల్ ఆఫర్లు ఈ ఏడాది హోటల్స్‌కు తాకాయి. విచిత్రమైన ఆఫర్లతో ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ఎయిర్‌బైపాస్‌లోని ఓ ప్రసిద్ధి చెందిన హోటల్‌లో బిరియానీ తినండి... కారు గెలవండి అని ఆఫర్ పెట్టారు. మరికొన్ని హోటళ్లు ఒక బిర్యానీ కొంటే చికెన్ లెగ్‌పీస్‌లు ఫ్రీ అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నాయి.

క్యాష్ బ్యాక్ ఆఫర్లు

మొబైల్స్ షోరూమ్‌లలో ఈఎంఐ సౌకర్యంతో పాటు క్యాష్ బ్యాక్ ఆఫర్లను ప్రకటించి కస్టమర్లను తమ వైపు తిప్పుకుంటున్నాయి. అన్ని రకాల కంపెనీ మొబెల్స్ దాదాపు దసరా డిస్కౌంట్లు ప్రకటించాయి. రూ.12వేల విలువ గల ఏ కంపెనీ మొబైల్స్ కొనుగోలు చేసినా స్మార్ట్ వాచ్, కంపెనీ గ్యారెంటీ ఇస్తూ ఒరిజినల్ ఇయర్‌ఫోన్స్ వంటి ఆఫర్లను ప్రకటించాయి. మరికొన్ని కంపెనీలు ఎక్ఛేంజ్ ఆఫర్లను కూడా ప్రకటించాయి. బంగారు దుకాణాల్లో గ్రాము గోల్డ్‌పై సుమారు రూ.120 వరకు తగ్గింపు ఆఫర్ ఇవ్వడం, వజ్రాలపై 20 శాతం, జెమ్స్‌స్టోన్స్‌పై రూ.280, వెండి వస్తువుల కొనుగోలుపై పలు రకాల డిస్కౌంట్లు ప్రకటించాయి.

జనరల్ స్టోర్స్‌లోనూ వన్ ప్లస్ వన్ ఆఫర్లు

చిన్న జనరల్ స్టోర్ల నుంచి పెద్దపెద్ద మార్ట్‌లు సైతం ఈ ఏడాది ఆఫర్లు ప్రకటించాయి. ప్రధానంగా వంట సరకుల విషయంలోనూ దసరా ఆఫర్లను ప్రకటించాయి. ప్రధానంగా సోపులు, షాంపులు, వాష్‌రూమ్ క్లీనింగ్ లిక్విడ్‌లు, బిస్కెట్లు, స్వీట్లు, వంట సరుకుల విషయంలో వన్ ప్లస్ వన్ ఆఫర్లను, 20 నుంచి 60శాతం వరకు డిస్కౌంట్‌తో పాటు ఫ్రీ డోర్ డెలివరీ చేస్తూ అమ్మకాలను పెంచుకుంటున్నాయి.

ఆఫర్లు బాగున్నాయి

ఈ ఏడాది దసరా ఆఫర్లు చాలా బాగున్నాయి. ప్రజలకు సౌకర్యవంతమైన ధరలకు వస్తువులను విక్రయిస్తున్నారు. వస్త్ర దుకాణాలలో ఆకర్షణీయమైన డిజైన్లు వచ్చాయి. ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అందుకే కుటుంబ సమేతంగా షాపింగ్ చేస్తున్నాం.

– దివ్య, తిరుపతి

ఇలాంటి ఆఫర్లు గతంలో చూడలేదు

పండుగ అంటే ఆఫ్లర్లు సర్వసాధారణమే. కానీ ఈ ఏడాది ఇంత పెద్ద ఎత్తున షాపింగ్ మాల్స్ ఆఫర్లను, డిస్కౌంట్లను. నగదు బహుమతులను ప్రకటించడం హర్షణీయం. ఇదో మంచి అవకాశంగా భావిస్తున్నా.

– శ్రీనివాసులరెడ్డి, సుభాష్ నగర్, తిరుపతి

సందడే సందడి

గతంలో కంటే ఈ ఏడాది పెద్ద సంఖ్యలో టీవీ కంపెనీలతో పాటు మొబైల్స్ కంపెనీలు డిస్కౌంట్లను ప్రకటించాయి. మేము దసరా ఆఫర్లతో కొన్ని గృహోపకరణాలను కొనుగోలు చేశాం.

– మోహన్, మారుతీ నగర్, కొర్లగుంట, తిరుపతి

అట్టహాసంగా ముగిసిన మోహన మంత్ర


ఫొటో ఫ్రేమ్‌లకు ఫోజులిస్తున్న విద్యార్థులు

చంద్రగిరి: శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థలో మూడురోజులపాటు జరిగిన మోహన మంత్ర–2023 కార్యక్రమం శనివారం అట్టహాసంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. ముఖ్యంగా హర్రర్ హౌస్ విద్యార్థులను ఎంతో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసిన అధ్యాపకులకు వీసీ నాగరాజ్ రామారావు కృతజ్ఞతలు తెలిపారు. రిజిస్ట్రార్ సారథి, ఇంజినీరింగ్ కళాశాల్ డీన్ సతీష్, అనుబంధ కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.













అమర వీరులకు జోహార్లు





అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం, కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న డెప్యూటీ సీఎం నారాయణ స్వామి

- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

తిరుపతి క్రైమ్: పోలీసుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డెప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. తిరుపతిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన అమరవీరుల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముందుగా జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు చేస్తున్న త్యాగాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మనందరి కోసం ప్రాణ త్యాగం చేసిన అమర వీరులను స్మరించుకోవడం మన విధి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. విధి నిర్వహణలో మరణించిన వారికి అందించే పరిహారం, కారుణ్య నియామకాలు, హోంగార్డుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు తెలిపారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి అమరులైన వారిని స్మరించుకోవడం అనేది గొప్ప కార్యక్రమమన్నారు.

21 నుంచి ఫ్లాగ్‌డే వేడుకలు

విధి నిర్వహణలో ప్రాణ త్యాగాలు చేసిన వారికి ప్రతి ఏటా అక్టోబర్ 21న వారి త్యాగాన్ని స్మరించుకోవడం మన కర్తవ్యమని ఎస్పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లాలో అమరులైన ఐదుగురు పోలీసుల కుటుంబాలను ఆదుకుంటామన్నారు. పోలీసు అమరవీరుల ప్రాణత్యాగాల సంస్మరణలో భాగంగా ఈ నెల 21 నుంచి 31 వరకు ఫ్లాగ్ డే వేడుకలు నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు.

ఆత్మీయ సత్కారం

అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా అడిషనల్ ఎస్పీ వెంకట్రావు దేశవ్యాప్తంగా అమరులైన 188 మంది పోలీసుల పేర్లను చదువుతూ అమర వీరుల స్తూపం వద్ద ఘన నివాళులర్పించారు. తదనంతరం అమరులైన పోలీసు కుటుంబాలను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి, నగరపాలక కమిషనర్ హరిత పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

తిరుపతి క్రైమ్: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. తిరుపతి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన అమర వీరుల దినోత్సవంలో ఆయన పాల్గొని, పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 75 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి ఏ రోజైనా మీరు చూశారా? అని ప్రశ్నించారు. సీఎం రాష్ట్రంలో మౌలిక సదుపాయాలతో కూడిన ఇళ్లు నిర్మించి ఇస్తున్నారన్నారు. చంద్రబాబు నేడు లాయర్లకు మాత్రమే రోజుకు రూ.25 కోట్లు ఖర్చు పెడుతున్నారని, ఈ డబ్బంతా ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమల కుమారి, రాజేంద్ర, లక్ష్మీనారాయణ రెడ్డి, డీఎస్పీ లో సిబ్బంది పాల్గొన్నారు.



దినకర..శుభకర!





చంద్రప్రభ వాహనంపై కల్యాణ వెంకన్న చిద్విలాసం, సూర్యప్రభ వాహనంపై శ్రీమన్నారాయణుడు

- వైభవంగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు
- సూర్య, చంద్ర ప్రభలపై విహరించిన స్వామివారు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన శనివారం ఉదయం శ్రీనివాసుడు సూర్యప్రభ వాహనంపై గోవర్ధనగిరిదారుని అలంకరణలో ప్రకాశించారు. సరిగ్గా 7.45 గంటలకు స్వామి వారిపై సూర్య కిరణాలు పడడంతో ఆలయ అర్చకులు హారతులు ఇవ్వగా భక్తుల గోవింద నామ స్మరణలతో మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై కల్యాణ వెంకన్న భక్తులను కటాక్షించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన ఆదివారం రథోత్సవం వైభవంగా జరగనుంది. ఉదయం 6 గంటలకు స్వామివారు రథారోహణం చేసి మాడ వీధుల్లో విహరించనున్నారు. అనంతరం రాత్రి అశ్వ వాహనంపై భక్తులను శ్రీవారు కటాక్షించనున్నారు.

కల్యాణ వెంకన్నకు సారె

మండలంలోని గాంధీపురం గ్రామపంచాయతీ ప్రజలు స్వామి వారికి పట్టు వస్త్రాలు, 2,116 కిలోల పండ్లు సమర్పించారు. వారికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్వాగతం పలికారు. గాంధీపురం సర్పంచ్ కట్టమంచి లక్ష్మిసెల్వం, మాస్ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి, శంకర్‌బాబు, దయాల్, శివ, దాము, చలపతి పాల్గొన్నారు.



సారె తీసుకొస్తున్న గాంధీపురం వాసులకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి







న్యూస్‌రీల్

పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పబ్లిక్, సప్లిమెంటరీలో ఫెయిలైన అభ్యర్థులు ఫీజు చెల్లించేందుకు ఈనెల 31వ తేదీ వరకు గడువు పెంచినట్లు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. ఫెయిలైన అభ్యర్థులు పరీక్షా ఫీజును ఏపీటీ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా పేమెంట్ గేట్‌వే లింక్ ద్వారా చెల్లించాలని తెలిపారు. అలాగే వీరికి స్టడీ సెంటర్‌లో క్లాసులకు హాజరయ్యేందుకు అవకాశం కల్పించారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 69,821 మంది స్వామివారిని దర్శించుకోగా 26,098 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.27 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

భేషుగ్గా ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ



సూచనలిస్తున్న జాయింట్ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ రాఘవేంద్ర

రేణిగుంట: తిరుపతి జిల్లాకు సంబంధించిన ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ నిబంధనల మేరకు బేషుగ్గా జరుగుతోందని జాయింట్ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ వీ.రాఘవేంద్ర తెలిపారు. ఆయన శనివారం రేణిగుంట సీడబ్ల్యూసీ గోడౌన్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌లో జరుగుతున్న ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను కలెక్టర్ వెంకటరమణారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియపై భెల్ ఇంజినీర్లకు పలు సూచనలిచ్చారు. ఈవీఎంల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈవీఎంల నోడల్ అధికారి కోదండరామిరెడ్డి, రేణిగుంట తహసీల్దార్ ఉదయ్ సంతోష్, ఎన్నికల తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహనంపై వేంకటపతి



చంద్రప్రభ వాహనంపై మలయప్ప

ప్రభల తేజం



వైకుంఠనాథుని సేవించుకుని సూర్యచంద్రులు ప్రభల తేజంతో ప్రకాశించారు. దేవదేవుని దివ్యచరణాలకు లేలేత కిరణాలతో ప్రభాత భానుడు.. వెన్నెల వెలుగులతో నెలరేడు ప్రణమిల్లారు. రామకృష్ణ గోవిందుని అవతారంలో విరాజిల్లుతున్న శ్రీహరిని దర్శించుకుని భక్తులు ఆనందపరవశులయ్యారు. సహస్రదీప కాంతుల్లో శ్రీనివాసుని విరాట్‌స్వరూపాన్ని వీక్షించి తన్మయత్వం చెందారు. శ్వేతవర్ణ కలువల అలంకరణలో ప్రసన్న వదనంతో అనుగ్రహించిన సర్వాంతర్యామి సన్నిధిలో పునీతులయ్యారు.

- అంగరంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగిన దేవదేవుడు
- నేడు స్వర్ణరథం, రాత్రి అశ్వవాహనం
- రేపటి చక్రస్నానంతో ఉత్సవాలు పరిపూర్ణం

తిరుమల : తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు శనివారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్ర ప్రభ వాహనాలపై ఊరేగారు. ఉదయం భాస్కరునిపై వేంకటపతి రామకృష్ణ గోవిందా అలంకారంలో స్వర్ణకాంతులీనుతూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం ఆలయం వెలుపల సహస్రదీపాలంకరణ సేవలో స్వామివారు ఊయలూగుతూ కనువిందు చేశారు. రాత్రి చంద్ర ప్రభ వాహనసేవలో చల్లనయ్య శ్వేత వర్ణ కలువ పువ్వుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవల్లో కళాకారుల అభినయం భక్తులను కట్టిపడేసింది. ఆలయంతోపాటు ఫల, పుష్ప ప్రదర్శనశాలలోని అలంకరణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నాదనీరాజనం, ఆస్థాన మండపంలో భక్తి, సంగీత కార్యక్రమాలు అలరించాయి.

నేటి వాహనసేవలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు ఆదివారం ఉదయం శ్రీవారికి స్వర్ణరథోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి కల్కి అవతారంలో అశ్వ వాహనంపై మలయప్ప ఊరేగనున్నారు.

రేపటి చక్రస్నానానికి సర్వం సిద్ధం

బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజు సోమవారం ఉదయం చక్రస్నానం నిర్వహించనున్నారు. ఈ మేరకు టీటీడీ అధికారులు సర్వం సిద్ధం చేశారు. పుష్కరిణిలో కొత్త నీటిని నింపి, వందశాతం క్లోరినేషన్ చేశారు. ప్రత్యేకంగా ఇనుప చైన్‌లింక్ కంచెలు నిర్మించారు. భక్తులను ఉదయం 4 నుంచి పుష్కరిణిలోకి అనుమతించనున్నారు.





వాహన సేవలో హైకోర్టు న్యాయమూర్తితో టీటీడీ చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి, కలెక్టర్



జగదభిరామ..జయజయ రామ



నయనానందకరం



నృత్యోత్సవం